JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 15-07-2026
Medchal - Malkajgiri । Wednesday 15-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 44
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 44 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




> తెలంగాణలో ప్రాంతీయ విమాన అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంతో పాటు పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోంది. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని కోరాను.
> -ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

...మిగతాది 2 లో

# ఎయిర్ పోర్టు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి

- **జూన్ 2, 2028 నాటికి మామునూరు ఎయిర్‌పోర్ట్ పూర్తిచేస్తాం.. రామ్మోహన్ నాయుడుతో రేవంత్ రెడ్డి భేటీ**
- **కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రేవంత్ భేటీ**

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 14 :**

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు.

# రాహుల్, ఖర్గే.. క్షమాపణ చెబుతారా?




2 లో

- **పీఎం మోదీ మెల్‌బోర్న్ సభకు వచ్చిన వారిని 'పెయిడ్ క్రౌడ్' అంటూ చేసిన అవమానకరమైన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలి**

**జయభేరి, న్యూఢిల్లీ :**

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఇటీవల అత్యంత అట్టహాసంగా జరిగిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమం చుట్టూ ఇప్పుడు తీవ్రమైన రాజకీయ వివాదం చెలరేగింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి హాజరైన వారు స్వచ్ఛందంగా వచ్చిన వారు కారనీ, వారిని డబ్బులిచ్చి రప్పించారని (పెయిడ్ క్రౌడ్) కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగంగా ఆరోపించడంపై ఈవెంట్ నిర్వాహకులు, ఆస్ట్రేలియాలోని భారతీయ కమ్యూనిటీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ తప్పుడు ఆరోపణలపై కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తూ ఒక సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారని ఇండియా టుడే రిపోర్ట్ చేసింది.

# E20 ఇంధనం సురక్షితమే





2 లో

- **E20 పెట్రోల్‌పై కేంద్రం మరోసారి క్లారిటీ..**
- **ప్రతి వాహన సమస్యకు ఎథనాల్ కారణం కాదన్న నితిన్ గడ్కరీ**

**జయభేరి, న్యూఢిల్లీ :**

ఎథనాల్ మిశ్రమ పెట్రోల్ (E20)పై కొనసాగుతున్న చర్చల నేపథ్యంలో కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. E20 ఇంధనంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, వాహనాల్లో తలెత్తే ప్రతి సాంకేతిక సమస్యకు ఎథనాల్‌ను బాధ్యుడిగా చేయడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. వాహనంలో లోపం తలెత్తితే ముందుగా సాంకేతిక తనిఖీ చేయించుకోవాలని, ఆధారాలు లేకుండా ఇంధనాన్ని నిందించడం సరికాదని సూచించారు. ఈ అంశం ఇటీవల యూట్యూబర్, వ్లాగర్ సౌరవ్ జోషి చేసిన వ్యాఖ్యలతో మరింత చర్చనీయాంశమైంది. తొలుత తన మెర్సిడెస్‌బెంజ్ SUV మైలేజ్ తగ్గడానికి E20 పెట్రోల్ కారణమని పేర్కొన్న ఆయన, తర్వాత సమస్య ఇంజిన్‌లో ఉన్న సాంకేతిక లోపం వల్లే వచ్చిందని వివరణ ఇచ్చారు. అంతకుముందే మెర్సిడెస్‌బెంజ్ ఇండియా తమ అన్ని BSVI పెట్రోల్ వాహనాలు E20 ఇంధనానికి పూర్తిగా అనుకూలంగా ఉంటాయని అధికారికంగా ప్రకటించింది. E20 పెట్రోల్‌పై వ్యక్తమవుతున్న సందేహాలకు స్పందించిన గడ్కరీ, ప్రత్యామ్నాయ బయోఫ్యూయెల్స్ వైపు దేశాన్ని తీసుకెళ్లే ప్రభుత్వ కార్యాచరణ ప్రారంభం నుంచే పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. ఈ మార్పుకు సంబంధించిన విధానం, రోడ్‌మ్యాప్‌ను ప్రతి దశలో ప్రజలకు వివరించామని చెప్పారు.



2 లో

# పసిమొగ్గపై లైంగిక దాడి

**జయభేరి, బెంగాల్, జూలై 14 :**

పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.!

# క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే వాస్తవాలు తెలిసేది



- **మార్చి 31కి పోలవరం తొలి దశ పూర్తి**
- **36 ప్రాజెక్టులు ప్రాధాన్య క్రమంలో పూర్తి**
- **నెలవారీ ఆర్థిక నివేదికలతో అభివృద్ధి**
- **సమన్వయంతో 2047 లక్ష్యాల సాధన: పీయూష్ కుమార్**
- **ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం**

**జయభేరి, అమరావతి, జూలై 14 :**

"ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి. వినూత్న ఆలోచనలతో సుపరిపాలనను ప్రజలకు అందించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు, విభాగాల అధిపతులతో (హెచ్‌వోడీ) మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నెలవారీ ఆర్థిక నివేదికలపై సమీక్షించారు. "ఒక మంచి అధికారి సమస్యను పరిష్కరిస్తే... అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చేస్తారు"... అనే కోణంలో పనితీరు కనబరచాలని సీఎం సూచించారు. "ప్రభుత్వం మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచలేదు.

...మిగతాది 2 లో



# అడ్డంగా దొరికిన ఏఈ సతీష్

- **HMDA చీఫ్ ఇంజనీర్ నివాసాల్లో ఏసీబీ సోదాలు**
- **రవీందర్ అక్రమాస్తులపై 15 టీమ్స్ తనిఖీలు**

**జయభేరి, హైదరాబాద్, జూలై 14 :**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు జరిపిన మెరుపు దాడిలో మున్సిపల్

...మిగతాది 2 లో

# ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకాలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 14 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో కొలువైన శ్రీఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరిగాయి. మంగళ వారం ఆంజనేయుడిని సింధూరంతో అలంకరించి స్వామి వారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



**నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా మంగళవారం రూ.19,72,064 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,00,754, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,21,200, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,72,350,కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,53,500,సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.42,600, ప్రసాద విక్రయం ద్వారా రూ.7,43,890, కల్యాణకట్ట ద్వారా రూ.29,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గానికి వస్తున్న తెలంగాణ ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కోరారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, మన ప్రియతమ నాయకుడు, తెలంగాణ ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గానికి రావడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అలాగే అమర్ రాజా ఫ్యాక్టరీ రెండో యూనిట్ ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. కావున దీనికి గాను అక్కడ అధికారులు అన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆయన పర్యటించే ప్రాంతాలలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు, నాయకులతో ఈ సందర్భంగా ఏర్పాట్లపై సమీక్షించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు.

## నీ సొగసు.. చూడతరమా..

- ముఖ్యమంత్రి రాక కోసం ముస్తాబైన పాఠశాల
- ప్రారంభోత్సవానికి ముస్తాబైన కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల



**జయభేరి, దేవరకద్ర :**

ప్రారంభోత్సవానికి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిద్ధమైంది. బుధవారం ఈ పాఠశాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో కలిసి ప్రారంభించానున్నారు. పాఠశాలకు రంగురంగుల విద్యుత్ బల్బులతో సర్వాంగ సుందరగా అలంకరించారు. ఈ దృశ్యం మంగళవారం రాత్రి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. నీ రాక కోసం.. నిలువెల్ల కనులై.. అన్న చందంగా ఈ పాఠశాల విద్యుత్ బల్బుల అలంకరణలు అందరి దృష్టిని ఎంతగానో ఆకట్టుకుంది.

# మిల్చీ సంస్థతో తనకు సంబంధముందో.. లేదో స్పష్టం చేయాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సవాల్
- 24 గంటల్లో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్

**జయభేరి, హైదరాబాద్, జులై 14 :**




మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సవాల్ విసిరారు. మిల్చీ డెయిరీ సంస్థతో హరీష్‌రావుకు సంబంధం ఉందో లేదో ప్రజలకు స్పష్టం చేయాలని బీర్ల అయిలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. హరీష్‌రావు తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంస్థలను విమర్శిస్తూ మరోవైపు అదే సంస్థలతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. శ్రీచైతన్య,నారాయణ విద్యాసంస్థలకు హరీష్‌రావు పాలు సరఫరా చేస్తున్నారని, హరీష్‌రావు సతీమణి తన్నీరు శ్రీనిత పేరుతో మిల్చీ పాల సంస్థను నడుపుతున్నారన్నారు.

మిల్చీ డెయిరీతో హరీష్‌రావుకు సంబంధముందో లేదో స్పష్టం చేయాలని,యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సాక్షిగా మిల్చీ సంస్థతో తనకు సంబంధం ఉందో లేదో 24 గంటల్లోగా బహిరంగంగా ప్రకటించాలని సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంస్థలతో దొంగచాటుగా వ్యాపారం చేస్తూ ,ప్రజల ముందు మాత్రం ఆంధ్ర సంస్థలను విమర్శించడం హరీష్‌రావుకు అలవాటైందని ఆరోపించారు. తన మిల్చీ సంస్థ ప్రయోజనాల కోసం విజయ డెయిరీ, మదర్ డెయిరీ వంటి సంస్థలను నష్టాలపాలు చేశారని విమర్శించారు. హరీష్‌రావు యాదగిరిగుట్టకు వచ్చినా,అసెంబ్లీకి వచ్చినా తనకు అభ్యంతరం లేదని, ఎక్కడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని బీర్ల అయిలయ్య తెలిపారు. హరీష్‌రావుకు దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి ద్వారా సంపాదించిన డబ్బుతోనే మిల్చీ డెయిరీ ఏర్పాటు చేశారని ఆరోపించారు. కేటీఆర్,హరీష్‌రావు ఇద్దరూ తెలంగాణ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని,ఇద్దరు నేతలకు మతి భ్రమించిందని విమర్శించారు. కేటీఆర్ పాదయాత్ర ప్రకటించగానే హరీష్‌రావుకు కూడా పాదయాత్ర గుర్తుకు వచ్చిందని,కేటీఆర్‌ను రాజకీయంగా అడ్డుకునేందుకే హరీష్‌రావు పాదయాత్ర చేపడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలు బయటపడతాయనే భయంతోనే బీజేపీతో బీఆర్ఎస్ నేతలు చీకటి ఒప్పందం చేసుకున్నారని బీర్ల అయిలయ్య ఆరోపించారు. తెలంగాణ ప్రజలు, రైతులను మోసం చేస్తూ పబ్బంగడుపుకునే రోజులు పోయాయని,ప్రజాపాలన ప్రజలంతా సంతోషంగా ఉన్నారు.

# నేడు పాలమూరు జిల్లాకు ముఖ్యమంత్రి రాక



- కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల, అమర్ రాజా ఫ్యాక్టరీ రెండో యూనిట్ ప్రారంభోత్సవం
- పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే జిఎంఆర్, ఎస్పీ, కలెక్టర్
- పార్టీ నాయకులకు దిశ నిర్దేశం చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచన

**జయభేరి, దేవరకద్ర :**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పాలమూరు జిల్లా పర్యటనకు వస్తున్నారు. దీనికిగాను అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా గట్టి పోలీస్ బంద్ ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో పాటు వనపర్తి జిల్లా ఎస్పీ, కలెక్టర్ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పలు సూచనలు అందజేశారు. అలాగే ఆయా శాఖల అధికారులతో కూడా ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందుగా రంగారెడ్డి జిల్లాలోని అమెజాన్ డాటా సెంటర్ నుంచి నేరుగా 1:20 గంటలకు దివిటిపల్లి వద్దకు హెలికాప్టర్ లో చేరుకుని అక్కడ అమర్ రాజా రెండో యూనిట్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడినుండి 2:20 గంటలకు హెలికాప్టర్ బయలుదేరి 2:40 గంటలకు కొత్తకోట చేరుకుంటారు. అక్కడ 2:45 నుండి 3:45 గంటల వరకు నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించే ముఖాముఖిలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. అక్కడినుండి 3:45 గంటలకు అక్కడి నుండి బయలుదేరి హెలికాప్టర్లో హైదరాబాద్ కు ముఖ్యమంత్రి వెళ్లిపోతారు.దీనికిగాను ముఖ్యమంత్రి రాక సందర్భంగా అమర్ రాజ ఫ్యాక్టరీ తో పాటు కొత్తకోటలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద గట్టి పోలీస్ ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా కొత్తకోటలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. స్వాగత తోరణాలు ఏర్పాట్లు చేస్తున్నారు.



## ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా నక్షా సర్వే పూర్తి చేయాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 14 :**

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా నాణ్యతతో, వేగవంతంగా నక్షా సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఆస్తికి ఖచ్చితమైన హద్దులను నిర్ధారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్షా సర్వేను రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు,నివాస గృహాలు, ప్లాట్ల వాస్తవ హద్దులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు, సర్వే బృందాలు ఎలా నిర్ధారిస్తున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. భూయజమానుల సమక్షంలో హద్దులను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. నక్షా సర్వే ద్వారా భూరికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్‌లో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ప్రతి సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో భూయజమానులు పూర్తి సమాచారం అందిస్తూ,వారి అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత రెవెన్యూ అధికారులు,జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి సుజాత,సర్వే బృందాల సిబ్బంది,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవతలకు జలాభిషేకం ప్రారంభం



**జయభేరి, దేవరకద్ర :**

వరుణుడి కరుణ కోసం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో దేవతామూర్తులకు జలాభిషేకం పూజా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభం అయినప్పటికీ అనుకున్న స్థాయిలో వర్షాలు కురవడం లేదు. దీంతో వరణుడి కరుణ కోసం శివయ్య అనుగ్రహం పొందడానికి స్థానిక కురుమవాడ భక్తులు వర్షం కోసం జలాభిషేకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంకా 4 రోజుల పాటు ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరగనుంది. ఈ సందర్భంగా మొదటి రోజు జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈఛాంపియన్ విజేత గణేష్ కు జకీ సన్మానం



**జయభేరి, దేవరకద్ర :**

టీజీ20 హైదరాబాద్ ఈఛాంపియన్ విజేత జట్టు క్రీడాకారుడు గణేష్ కు మంగళవారం దేవరకద్ర కు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సయ్యద్ జకీ ఘనంగా సన్మానించారు. టీజీ20 హైదరాబాద్ ఈఛాంపియన్ విజేత జట్టు తరఫున గణేష్ అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. నారాయణ పేట జిల్లా మరికల్ మండలం వెంకటపూర్ కు చెందిన గణేష్ ఈ ప్రతిభను తన సొంతం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జకీ ఆ గ్రామానికి వెళ్లి గణేష్ కు పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. క్రీడాకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రామగుండం పోలీస్ కమిషనర్

**జయభేరి, గోదావరిఖని:**

సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం ఆర్జీ01 పరిధిలోని ఓసీపీ05 వద్ద రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన బాస్కర్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కొత్తకోటలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి బుధవారం వస్తున్న సందర్భంగా మంగళవారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి బాస్కర్ రెడ్డి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమ వేదిక, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులు, పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఘన విజయమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తూ, ప్రతి ఏర్పాటును స్వయంగా ఆయన పర్యవేక్షిస్తున్నారు.

## హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని అమర్ రాజా ఫ్యాక్టరీ రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా మంగళవారం హెలిప్యాడ్ స్థలాన్ని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలను ఆయన అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి రాక సందర్భంగా అక్కడ నిర్వహించే అన్ని ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముమ్మరంగా ఏర్పాట్లు


- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్, ఎస్పీ, కలెక్టర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మండల కేంద్రానికి బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయి అధికారులతో కలిసి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ అంటే వనపర్తి జిల్లా కలెక్టర్, ఎస్పీ తో పాటు వివిధ శాఖల అధికారులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాక సందర్భంగా నిర్వహించే ఏర్పాట్లతోపాటు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక ఏర్పాటు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్షించారు. పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు ఉండేలా అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం కావడానికి ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసే ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశం జయప్రదం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, జూలై 14 :**

ఆగస్టు 16 17, 18 తేదీల్లో భువనగిరిలో జరిగే సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరిలో మూడు రోజులపాటు జరుగుతున్న ఈ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆల్ ఇండియా రాష్ట్ర నాయకత్వంతో పాటు అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సమగ్రంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ తుటి వెంకటేశం, భవన నిర్మాణ యూనియన్ అధ్యక్షుడు పాముల రవి మాజీ అధ్యక్షుడు పాముల మల్లేష్, ఉపాధ్యక్షులు సుమన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో విభేదాలకు తెర

- రాజీనామా నిర్ణయం వెనక్కి
- సీనియర్ల చొరవతో ఒక్కతాటిపైకి నేతలు

**జయభేరి, మేడ్చల్ :**



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా కొనసాగిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవి నియామకాన్ని వ్యతిరేకిస్తూ తీవ్ర అసంతృప్తికి గురై పార్టీకి రాజీనామా ప్రకటించిన స్థానిక నేతలు, సీనియర్ నాయకుల జోక్యంతో తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని పార్టీలోనే కొనసాగనున్నట్లు ప్రకటించారు. పార్టీలో నెలకొన్న విభేదాలను పరిష్కరించి గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులతో ఆయన జరిపిన చర్చలు ఫలించి, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించడంతో పరిస్థితి చక్కబడింది. గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్, గుండ్లపోచంపల్లి 299 డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఈ అంశంపై చర్చించి విభేదాలకు అధికారికంగా తెరదించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, అంతర్గత పరిణామాల వల్ల తాత్కాలికంగా అసంతృప్తి వ్యక్తమైనప్పటికీ, పార్టీ బలోపేతమే తమ లక్ష్యమని, ఇకపై అందరూ కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ సీనియర్ల సమక్షంలో జరిగిన చర్చలతో అన్ని అపోహలు తొలగిపోయాయని, మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యేలా కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గుండ్లపోచంపల్లి 299 డివిజన్‌లో పార్టీని మరింత బలపర్చేందుకు కృషి చేస్తామని స్థానిక నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో పోచారం డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ఫిర్జాగూడా డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మేడ్చల్ మాజీ మండల అధ్యక్షుడు వరదరెడ్డి, కీసర మాజీ మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్, మాజీ జెడ్పీటీసీ, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, మాజీ ఏబ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, 299 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్, ఏబ్లాక్ మహిళా అధ్యక్షురాలు తాటికాయల కోమలతతో పాటు కావాలి భాస్కర్, లక్ష్మీనారాయణస్వామి ఆలయ కమిటీ డైరెక్టర్లు అనిల్, ఉదయ్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకట్, కిషన్, షబ్బీర్, సందీప్, ప్రవీణ్, నందు, ఎర్రోళ్ల యాదయ్య, హర్ష, సుతారి గూడ మల్లేష్, మాధవరెడ్డి, వినోద్, సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ విరాళం

- 20 బెంచీలు, 400 పుస్తకాల పంపిణీ

**జయభేరి, మేడ్చల్ :**




సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ (CMRTC) ఎన్ఎస్ఎస్ యూనిట్ మరోసారి తన సేవా నిబద్ధతను చాటుకుంది. కండ్లకోయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 20 తరగతి గది బెంచీలు, 400 పుస్తకాలను విరాళంగా అందించి విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పాటును అందించింది. క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ చైర్మన్ చి. గోపాల్ రెడ్డి, డైరెక్టర్ ఎ. రాజి రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులకు బెంచీలు, పుస్తకాలను అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు తమ వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతలో భాగమని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గది వాతావరణం కల్పించడంతో పాటు పఠన సంస్కృతిని పెంపొందించేందుకు పుస్తకాల విరాళం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చూపుతున్న అంకితభావం ఆదర్శనీయమని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ యాజమాన్యానికి, ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విరాళంగా అందించిన బెంచీలు విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించనున్నాయని, పుస్తకాలు వారి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. "నాట్ మీ... బట్ యూ" అనే ఎన్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిస్తూ సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం ముందంజలో కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ యూనిట్ 320కి పైగా సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి సమాజాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుండటం విశేషం.

# పెండింగ్ స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

**జయభేరి, దేవరకొండ :**




ఇందిరా పార్క్ వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య చేపట్టే సత్యాగ్రహ దీక్షకు సంఘీభావ ర్యాలీ. పాత పద్ధతిలో ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని కొనసాగించాలి లేకపోతే యుద్ధమే. సామాజికవేత్త, ఏపీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి 10,500 కోట్ల స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్ లు తక్షణమే విడుదల చేయాలని సత్యాగ్రహ దీక్ష చేస్తుండగా దేవరకొండ పట్టణంలో సంఘీభావంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిండి రోడ్డు వద్ద గల మీనాక్షి సెంటర్ నుండి కోర్టు మీదుగా వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద కు చేరుకొని అంబేద్కర్ కు పూలమాలవేసి నిరసన వ్యక్తం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్, రీయంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి. లేని పక్షాన త్వరలో కార్యాచరణ ప్రకటించబో తున్నాము ప్రభుత్వము విద్యార్థులను రోడ్ల మీదకి తీసుకొచ్చే దుస్థితి తీసుకువచ్చిందని విద్యార్థులు ఆగ్రహాన్ని ప్రభుత్వాలు తెచ్చుకోవద్దని ఆగ్రహంతో ఉద్యమిస్తే ఏ ప్రభుత్వాలు ఇప్పటివరకు నిల్వలేదని గత ప్రభుత్వానికి పట్టినటువంటి గతి ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు అన్ని కార్యక్రమాలకు నిధులు ఉంటాయి. కానీ విద్యార్థుల భవిష్యత్తు పేద, బడుగు బలహీనవిద్యార్థుల యొక్క భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిధులు కేటాయించకుండా చదువుకు దూరం చేసే పరిస్థితి తీసుకొస్తుందని దశలవారీగా ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని, ఇలాంటి కుట్రలను బలహీన వర్గాల కేనా, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసి రియంబర్స్మెంట్ పథకాన్ని సాధించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగొని శివ గౌడ్, అప్పం వీరయ్య, పున్న బిక్షమయ్య, కాటం వెంకటేష్ గౌడ్ , ఆడారపు గణేష్, ఆకారపు గౌతమ్, నాగపల్లి సుధాకర్, రామావత్ రాము, ఆంజనేయులు, వింజమూరు వెంకటేశ్వర్లు, లిఖిత, దీపక్ ,చిన్న నాయక్, శాంతి రాజు, రామావత్ పాండు నాయక్, వర్త్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్‌పై అవగాహన కార్యక్రమం

- JSJB 3.0 కింద రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్‌పై అవగాహన కార్యక్రమం

**జయభేరి, దేవరకొండ :**



CDMA మేడమ్ ఆదేశాల మేరకు మరియు జల్ సంచయ్ జన భాగీదారి (JSJB) 3.0 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న CatchTheRain ప్రచారంలో భాగంగా, దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలోని రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ వద్ద వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ మార్గాలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాముఖ్యతపై మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించి, నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, సుస్థిర జల నిర్వహణ యొక్క ప్రాముఖ్యతపై మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామాదుర్గ రెడ్డి, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సురిగి శంకర్ గౌడ్, TPBO వర్షిత, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రమావత్ సక్కు నాయక్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లోహిత్ ఫార్మాలో అస్వస్థతకు గురైన కార్మికుడు కి మెరుగైన అందించాలి

- యాజమాన్యంపై చర్యలు తీసుకొని సమగ్ర విచారణ చేయాలి
- ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**

ఫార్మా సిటీలో లోహిత్ ఫార్మా లో సోమవారం ఏ షిఫ్ట్ కి డ్యూటీకి హాజరై క్లీనింగ్ పనులు నిర్వహిస్తున్న టి.వి రమణమూర్తి అస్వస్థతకి గురయ్యారు. దీనిపై సమగ్ర విచారణ చేసి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి మండలం పాపిసంతపాలెం గ్రామానికి చెందిన టివి రమణమూర్తి కంపెనీలో డ్యూటీ సమయంలో దగ్గు వస్తుందని యాజమాన్యానికి చెప్తే బెల్లం తినమని సలహా ఇచ్చారని బెల్లం తిన్న దగ్గు తగ్గకపోవడం ఏ షిఫ్ట్ ముగించుకొని ఇంటికి వెళ్ళి తీవ్రమైన దగ్గు రావడంతో అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఇక్కడ వైద్యం జరగదని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించాలని తెలిపారు. దీంతో విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడు. యాజమాన్యం మెరుగైన వైద్య సేవలు అందించాలని గని శెట్టి డిమాండ్ చేశారు.ఆయన కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని అన్నారు. పరిశ్రమలో ఏ రకమైన డ్రగ్ బ్యాచ్ వేస్తున్నారు. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారు. వాటిపై సమగ్ర విచారణ చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. సక్రమమైన మాస్కులు ధరించి ఉంటే కార్మికుడి పరిస్థితి ఈ రకంగా ఉండేది కాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గంలో జరుగుతున్న SIR సర్వే పురోగతి, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, సర్వే ప్రక్రియను మరింత వేగవంతంగా మరియు పారదర్శకంగా నిర్వహించే అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోనల్ కమిషనర్ రాధిక గుప్తతో జోనల్ కార్యాలయంలో సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సర్వే ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సర్వే పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని, సిబ్బంది క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. జోనల్ కమిషనర్ రాధిక గుప్త ఐఏఎస్, సర్వే పురోగతిపై ఎమ్మెల్యేకు వివరాలు తెలియజేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు SIR సర్వేను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా కీలకం

- **ప్రతి బూత్‌లో బీజేపీ అప్రమత్తంగా పనిచేయాలి డా. గంగిడి మనోహర్ రెడ్డి**

**జయభేరి, దేవరకొండ :**



భారతీయ జనతా పార్టీ దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంపై అసెంబ్లీ స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డా. గంగిడి మనోహర్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా పవిత్రతను కాపాడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడినట్టేనని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరగాలంటే, నకిలీ నమోదులు, అనర్హుల పేర్లు, ఇతర అక్రమాలను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి, ఒక్క అర్హుడూ మిగలకుండా నమోదు చేయడంతో పాటు ప్రతి తప్పును గుర్తించి సరిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన SIR కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి పోలింగ్ బూత్‌లో బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించి, ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ, బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్, చెనమోని రాములు,వనం పుష్పలత, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు వినోద్ రాథోడ్, వనం సుజాత, వస్కుల సుధాకర్, సముద్రాల నగేష్, నాగిళ్ల ఆంజనేయులు, వినోద్ చారి, రాము నాయక్, నియోజకవర్గంలోని మండల, పట్టణ, శక్తి కేంద్ర, బూత్ కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతి బూత్‌లో SIR కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ప్రజాస్వామ్య పరిరక్షణలో బీజేపీ ముందుంటుందని సంకల్పించారు.



## ఎట్టకేలకు ఫలించిన టిడిపి యువ నేత చంద్రశేఖర్ కృషి

- **సబ్‌స్టేషన్ కూడలిలో బస్ స్టాప్ నిర్మాణానికి ముందుకొచ్చిన లారస్ ల్యాబ్స్**
- **ఎమ్మెల్యే పంచకర్లకి, లారస్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన చంద్రశేఖర్**

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ కూడలిలో బస్ స్టాప్ ఏర్పాటు కోసం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్ చేసిన నిరంతర పోరాటం ఎట్టకేలకు ఫలించింది.ఎన్నోసంవత్సరాలుగా బస్సుల కోసం ఎండ, వర్షంలో వేచి ఉండాల్సి వస్తున్న విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన ఆయన ఈ సమస్య పరిష్కారమే లక్ష్యంగా అధికారుల దృష్టికి పదేపదే తీసుకెళ్లి కృషి చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2023లో గ్రామ యువతతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సబ్ స్టేషన్ కూడలిలో బస్ స్టాప్ నిర్మాణం అత్యవసరమని వివరించారు.అనంతరం 2024లోరాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు కూడా సమస్యను తెలియజేస్తూ వినతిపత్రం సమర్పించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యను పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో లారస్ ల్యాబ్స్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా బస్ షెల్టర్ నిర్మాణానికి అంగీకరించింది.ఇప్పటికే కూటమి నాయకులు,సంబంధిత అధికారులు స్థల పరిశీలన కూడా పూర్తి చేయడంతో బస్ స్టాప్ నిర్మాణానికి మార్గం సుగమమైంది.ఈ సందర్భంగా వర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులే తనకు ముఖ్యమని ముఖ్యంగా ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు సురక్షితంగా బస్సుల కోసం వేచి ఉండేలా బస్ స్టాప్ ఏర్పాటు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, లారస్ ల్యాబ్స్ యాజమాన్యంకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బండారు చిన్నం నాయుడు, పైలా బుజ్జి, పైలా కృష్ణ, పైలా అప్పారావు, పైలా ఈశ్వర్ రావు తదితరులు పాల్గొని వర్రి చంద్రశేఖర్ కృషిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## చాడ కొండాల్ రెడ్డికి సన్మానం



**జయభేరి, సైదాపూర్ :**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డిని ఎల్లంపల్లి కాంగ్రెసు నాయకులు మాజీ ఉపసర్పంచ్ మెడబోయిన మహేందర్, సుంకరి యాదగిరి, సుంకరి శ్రీనివాస్ లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, AMC వైస్ చైర్మన్ న్యాథండ్ల రాజు కుమార్, మిట్టపల్లి కిష్టయ్య, తాళ్ళపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల్లో బంద్ విజయవంతం

- **స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో కళాశాలల్లో బంద్ విజయవంతం**

**జయభేరి, దేవరకొండ :**



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ డివిజన్ పరిధిలోని పలు కళాశాలల్లో బంద్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ , పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడడం మానుకుని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి మహా ఉద్యమాన్ని చేపట్టి, ప్రభుత్వాన్ని నిలదీస్తామనీ ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకూరి శ్రీకాంత్, నగర్ కార్యదర్శి పగిళ్ల విక్రమ్, నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమ సుందర్, దమోజు అమితేష్, గుండాల శివరామరాజు, వినయ్, బిట్టు, సాయి, అబ్దుల్లా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## RO తాగునీటి ప్లాంట్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

- **మానవ హక్కుల సెల్ తెలంగాణ డిమాండ్**

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ మున్సిపల్ పరిధిలోని RO తాగునీటి ప్లాంట్లపై సమగ్ర విచారణ చేపట్టాలి - మానవ హక్కుల సెల్ తెలంగాణ డిమాండ్. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 40 వరకు RO తాగునీటి ప్లాంట్లు పనిచేస్తున్నాయని సమాచారం ఉంది. ఈ ప్లాంట్లలో అవసరమైన ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు, నీటి నాణ్యత పరీక్షలు మరియు చట్టబద్ధ ప్రమాణాలు పూర్తిగా పాటిస్తున్నారా అనే అంశంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దేవరకొండ ప్రాంత భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న విషయం తెలిసిందే. ఇలాంటి ప్రాంతాల్లో నిర్వహించే RO ప్లాంట్లు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయడం అత్యంత అవసరం. నీటి శుద్ధి ప్రక్రియలో ఉపయోగించే రసాయనాలు, ఫిల్టర్లు, నిర్వహణ ప్రమాణాలు సక్రమంగా లేకపోతే ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా జీర్ణాశయ సమస్యలు, మూత్రపిండాల సమస్యలు, చర్మ సంబంధిత సమస్యలు మరియు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంశంపై నేను దేవరకొండ మున్సిపల్ కమిషనర్, నల్గొండ జిల్లా కలెక్టర్ మరియు ఆర్‌డీఓలకు లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర తనిఖీలు లేదా ప్రజలకు వెల్లడించే విధంగా చర్యలు తీసుకోలేదు. అందువల్ల ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు వెంటనే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని RO ప్లాంట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. ప్రతి ప్లాంటుకు ఉన్న చట్టబద్ధ అనుమతులు, లైసెన్సులు, నీటి నాణ్యత పరీక్షా నివేదికలను పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్లాంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తనిఖీ నివేదికలను బహిరంగంగా ప్రకటించాలి. ప్రజల ఆరోగ్యం ఏ రాజకీయ, వ్యాపార లేదా ఇతర ప్రయోజనాల కంటే ముఖ్యమైనది. చట్టబద్ధ ప్రమాణాలు అమలులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు పారదర్శకంగా పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలని మానవ హక్కుల సెల్ తెలంగాణ డిమాండ్ చేస్తోంది.

## నోరు అదుపులో పెట్టుకో శివచరణ్ రెడ్డి



- **శివచరణ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం నాయకుల డిమాండ్**

**జయభేరి, గజ్వేల్/ వర్గల్, జులై 14 :**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత పదజాలం ఉపయోగించారని ఆరోపిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాకిడి శివచరణ్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని వర్గల్ మండల యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మహిళలను అవమానించేలా ఎవరూ వ్యాఖ్యలు చేయరాదని, అలాంటి ఘటనలను యాదవ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్, వర్గల్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు స్వామి యాదవ్ తో పాటు పలువురు యాదవ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండదు

- **ఘణపూర్ గ్రామంలో SIR ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి పర్యవేక్షణ**

**జయభేరి, సైదాపూర్ :**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ SIR ప్రక్రియలో భాగంగా ఘణపూర్ గ్రామంలో పర్యటించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన ఒక్క ఓటరిని కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటరు జాబితా నుండి తొలగించరాదని, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన ప్రతి అర్హుడి పేరును తప్పనిసరిగా ఓటరు జాబితాలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పూర్తి పారదర్శకతతో SIR ప్రక్రియను నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ బాసరాజు రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సీనియర్ నాయకులు, మండల సీనియర్ నాయకులు, యువ నాయకులు మరియు కార్యకర్తలు కలిసి మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి గారిని ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాసరాజు రజిత శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొరిమి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, BLO ఓలాద్రి రజిత, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్తులు, కార్యకర్తలు, ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పరవాడ మండల పరిధిలో బ్యాటరీ దొంగలు బాబోయ్ దొంగలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల పరిధిలో బైక్లు టాక్టర్లు బ్యాటైర్స్ రాత్రి సమయంలో దొంగతనం చెయ్యడం ఈ మధ్య కాలంలో పరపాటిగా మారింది. నాయుడు పాలెం పంచాయతీ పరిధిలో ఉన్న రాముడు గారు ఊరులో సోమవారం రాత్రి సమయంలో జెసిపి నాయుడు, సన్నాసిరావుకి సంబంధించిన ట్రాక్టర్ బ్యాటరీలు దొంగలు చోరీ చేసారు.నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో ఇంతవరకు కోళ్లు, కోడిపుంజులు, మేకపోతులు, గొర్రి పోతులు, చోరీ చేయడం ఎక్కువగా జరిగేవని పోలీసు భద్రతతో ఈ మధ్య కాలంలో కొద్దిగా తగ్గుముఖం పట్టాయి అని మరలా ఎక్కువగా బైకులకు సంబంధించిన బ్యాటరీలు అక్కడక్కడ కూడా చోరీ జరిగుతున్నాయని స్థానిక ప్రజానీకం తెలిపారు. ఇప్పుడు వ్యవసాయంకి ఉపయోగం చేసే టాక్టర్ బ్యాటరీస్ పొట్టుకుపోవడం వలన రైతులకి తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు.ఈ విధంగా జరగకుండా ప్రభుత్వం వారు పంచాయితీ ప్రజా ప్రతినిధులు పోలీస్ భద్రత సిబ్బంది దీనిపై తగిన చర్యలు తీసుకొని దొంగతనాలు జరగకుండా పోలీస్ శాఖ వారు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.

## విశాఖలో మాజీ సీఎం జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పయిల

- **గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించేందుకు రాక**



**జయభేరి, పరవాడ :**

ఇటీవల చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం రావడంతో . విశాఖపట్నం విమానాశ్రయం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు మాడుగుల నియోజకవర్గం పరిశీలకుడు పైలా శ్రీనివాసరావు ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయుకులు గండి రవికుమార్, పైలా సాయి అప్పలనాయుడు,బండారు శ్రీనివాసరావు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐడియా సెల్ టవర్ 46 బ్యాటరీలను ఎత్తుకెళ్లిన దొంగలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడి గ్రామం వద్ద ఉన్న ఇండస్ సెల్ టవర్ (ఐడియా టవర్)లో జరిగిన బ్యాటరీల చోరీ ఘటనపై పరవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీస్ శాఖ తెలిపిన వివరాల్లోకి వెళ్ళితే ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు టవర్ ఇండోర్ షెల్టర్ తాళం పగులగొట్టి లోపల ఉన్న మొత్తం 46 అమరరాజా బ్యాటరీలను అపహరించారని వాటి విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని అన్నారు. ఘటన సమయంలో టవర్ వద్ద ఉన్న అనుమానితులు వాహనంలో పరారయ్యారని సంఘటన స్థలంలో ఒక పల్సర్ మోటార్ సైకిల్ నెం.ఏపీ 31 డీడీ 6540 గుర్తించబడిందని దీనిపై కేసు నోమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ శాఖ అధికారులు తెలిపారు.

## ముద్రగడ అకాల మరణంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన కాపునేత మోటూరు హరిబాబు



**జయభేరి, పరవాడ:**

మాజీ మంత్రి,కాపు ఉద్యమ అగ్రనేత ముద్రగడ పద్మనాభం అకాల మరణం పట్ల పెందుర్తి నియోజకవర్గం కాపు సంక్షేమ సేన మాజీ ఉపాధ్యక్షుడు పరవాడ మండలం రావాడ పంచాయతీ సీనియర్ జనసేన నాయకులు మోటూరు హరిబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ముద్రగడ మరణవార్త తనను ఎంతగానో కలచివేసిందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లో నిబద్ధతకు,నైతిక విలువలకు మారుపేరుగా నిలిచారని తన జీవితాంతం సామాజిక వర్గ ప్రయోజనాల కోసం,ప్రజా పక్షాన ఆయన చేసిన పోరాటాలు అమోఘమన్నారు.4 సార్లు ఎమ్మెల్యేగా 2 సార్లు మంత్రిగా ఒకసారి ఎంపీగా ఆయన అందించిన సేవలు రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.ఆయన మరణం రాజకీయ రంగానికి ముఖ్యంగా కాపు సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.విలువల రాజకీయం చేసిన ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఈ అకాల మరణాన్ని తట్టుకునే ధైర్యాన్ని,మానసిక శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ వారి కుటుంబానికి హరిబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# 'రాకా'లో మరో హీరోయిన్ ఫిక్స్..!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్‌వరల్డ్ చిత్రం 'రాకా' పై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నైలా గ్రేవల్, "దర్శకుడు అట్లీతో పని చేయాలని చాలా కాలంగా కోరుకుంటున్నాను. ఇప్పుడు ఆ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. బాలీవుడ్‌లో మాత్రమే పనిచేసిన నన్ను ఇలాంటి భారీ పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌కు ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'రాకా'లో భాగమవడం నా కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయి" అని చెప్పింది. నైలా గ్రేవల్ ఇప్పటికే 'తమాషా', 'బరేలీ కి బర్ఫీ', 'తప్పడ్', 'ఇష్క్ విశ్క్ రీబౌండ్' వంటి హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. అలాగే ఓ ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్‌లోనూ మెప్పించింది. ఇప్పుడు అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది.



# ది ప్యారడైజ్ కొత్త రిలీజ్ డేట్?

అగ్ర కథానాయకుడు నాని 'ది ప్యారడైజ్' సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యంగా నాని నటిస్తున్న 'జడల్' పాత్రకు సంబంధించిన లుక్, 'ఆయా షేర్' సాంగ్, ప్రచార చిత్రాల్లో కనిపిస్తున్న సినేరియా.. ఇవన్నీ సినిమాపై జనాల్లో ఆసక్తిని పెంచాయి. పైగా 'దసరా' తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని చేస్తున్న సినిమా కావడం కూడా ఈ అంచనాలకు ఓ కారణం. అయితే.. ఈ సినిమా విడుదల విషయంలో నెలకొన్న జాప్యం సినీ వర్గాల్లోనే కాక, సగటు ప్రేక్షకుల్లో కూడా చర్చనీయాంశమైంది. ఈ సినిమాను మొదట్లో ఈ ఏడాది మార్చిలో విడుదల చేయాలనుకున్నారు. ఆ తర్వాత ఆగస్ట్ 21కి వాయిదా వేశారు. ఇప్పుడు ఆ తేదీ కూడా మారినట్టు తెలుస్తున్నది. షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడం, ప్రచారానికి తగిన సమయం లేకపోవడం తదితర కారణాల వల్ల ఈ చిత్రం విడుదలను సెప్టెంబర్ 24కు వాయిదా వేసినట్టు ఫిల్మ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అగ్రనటుడు మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేశ్‌బాబు, ఈశ్వరీరావు ఇతర పాత్రధారులు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం సమకూరుస్తున్న ఈ పానిండియా చిత్రాన్ని సీఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

# పోలీస్ పాత్రలో కొత్త సినిమా?



'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు కన్నడ అగ్ర హీరో యశ్. ఆయన తాజా చిత్రం 'టాక్సిక్' ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు బాలీవుడ్ 'రామాయణ'లో కూడా యశ్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత యశ్ చేయబోయే ప్రాజెక్ట్ ఏంటన్నది ఆసక్తికరంగా మారింది. తాజా సమాచారం ప్రకారం 'సప్త సాగరదాచే ఎల్లో' (తెలుగులో 'సప్తసాగరాలు దాటి') చిత్రంతో కన్నడంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు దర్శకుడు హేమంత్ ఎమ్ రావ్. ఆయన దర్శకత్వంలో యశ్ తన తదుపరి సినిమా చేయబోతున్నారని కన్నడ ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. ఇందులో యశ్ పోలీస్ పాత్రలో కనిపించబోతున్నారని, సామాజిక అంశాల చుట్టూ అల్లుకున్న ఈ కథలో ఆయన ఫెరోషియస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని తెలిసింది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# 'టాక్సిక్' నుంచి మరో క్రేజీ అప్డేట్..




దక్షిణాది ప్రేక్షకులతో పాటు నార్త్ ఆడియెన్స్ అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తోన్న సినిమాల్లో టాక్సిక్ ఒకటి. కన్నడ రాక్ స్టార్ యశ్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రానికి మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీని ఇప్పటికే ప్రకటించారు. అలాగే ఈ సినిమాకు సంబంధించిన కొన్ని టీజర్లు, క్యారెక్టర్ పోస్టర్లు కూడా విడుదలయ్యాయి. దీంతో ఈ సినిమాపై క్రేజ్ రోజురోజుకు పెరుగుతోంది. కొద్ది రోజుల క్రితమే 'టాక్సిక్' సినిమాలోని 'తబాహి' పాట విడుదలైంది. ఈ పాట మేకింగ్, కియారా, యష్‌ల మధ్య కెమిస్ట్రీ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఇప్పుడు, సంగీత దర్శకుడు విశాల్ ఈ సినిమాలోని మరో పాట గురించి ఒక అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఒక సంగీత కార్యక్రమం కోసం కాలిఫోర్నియా వెళ్లిన సంగీత దర్శకుడు విశాల్, అక్కడి నుంచే 'టాక్సిక్' సినిమాలోని నాలుగో పాటపై పనిచేయడంలో నిమగ్నమై ఉన్నారు.

సోషల్ మీడియాలో తన వర్క్‌స్టేషన్ ఫోటోను పంచుకుంటూ, తాను 'టాక్సిక్ - పిబిఎస్ 4' అనే ప్రాజెక్ట్ ఫైల్‌పై పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. విశాల్ ఇచ్చిన ఈ అప్‌డేట్‌ను చూసిన అభిమానులు, ఈ సినిమా నుంచి మరో పాట త్వరలో విడుదల అవుతుందని ఆశిస్తున్నారు. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'టాక్సిక్' చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ కథానాయికలుగా నటించారు. ఇప్పటివరకు విడుదలైన టీజర్లు, పాటలను బట్టి చూస్తే, ఈ చిత్రంలో చాలా హాట్ సీన్లు, యాక్షన్ సీన్లు ఓ రేంజ్ లో ఉంటాయని స్పష్టమవుతోంది.

ఈ చిత్రంలో యశ్ రాయ్, టికెట్ అనే రెండు డిఫరెంట్ పాత్రల్లో కనిపించనున్నాడు. ఈ చిత్రంలో అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ సహా పలువురు విదేశీ నటీనటులు కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా సంగీతం అందిస్తున్నారు. కొన్ని పాటలకు విశాల్ కూడా సంగీతం అందించారు.

ఇప్పటికే విడుదలైన 'తబాహి' అనే పాటకు విశాలే సంగీతం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా నిర్మించిన టాక్సిక్ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే ఆమె భర్త, జాతీయ అవార్డు గ్రహీత అయిన రాజీవ్ రవి సినిమాటోగ్రఫీని అందించారు. ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది.



# మా ముందే దుస్తులు వేసుకోవచ్చుగా..?

ఇటీవల కొందరు హీరోయిన్స్ తమను వెనుక నుంచి ఫోటోస్ తీయడం.. అలాగే జూమ్ చేస్తూ ఫోటోస్ తీయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తాజాగా బాలీవుడ్ నటి జరీన్ ఖాన్‌కు ముంబైలో ఇలాంటి ఒక చేదు అనుభవమే ఎదురైంది. తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కొందరు ఫోటోగ్రాఫర్లపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల జరీన్ ఖాన్ ముంబైలోని ఒక ప్రముఖ డిజైనర్ స్టోర్‌కు వెళ్లారు. అక్కడ ఆమె కొన్ని దుస్తులను చూపిస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ఈ క్రంలోనే సెలబ్రిటీల కదలికలపై నిఘా ఉంచే పాపరాజీలు అక్కడికి కూడా చేరుకుని, ఆమె లోపలికి వెళ్తున్న సమయంలో కెమెరాలతో చుట్టుముట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కొందరు ఫోటోగ్రాఫర్లు అత్యుత్సాహం ప్రదర్శించారు. అందులో ఒక ఫోటోగ్రాఫర్ ట్రయల్ కరో.. (దుస్తులు వేసుకోండి) అని అన్నారు. ఈ కామెంట్స్ విన్న జరీన్ ఖాన్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తీవ్ర అసహనానికి లోనైన ఆమె, అక్కడికక్కడే ఆ ఫోటోగ్రాఫర్లపై మండిపడ్డారు. ఏంటీ.. మీ ముందేనా...? ఇలాంటి ఫాల్తూ మాటలు నా ముందు మాట్లాడొద్దు. మీ హద్దులు దాటొద్దు అంటూ గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. అలాగే మహిళల పట్ల మాట్లాడేటప్పుడు కనీస మర్యాద, విచక్షణ ఉండాలని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. జరీన్ ఖాన్ తీసుకున్న నిర్ణయాన్ని, ఆమె స్పందించిన తీరును నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. సెలబ్రిటీలకైనా ప్రైవసీ ఉంటుందని, ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలను అస్సలు సహించకూడదని మద్దతు తెలుపుతున్నారు. పాపరాజీలు తమ పరిధులు తెలుసుకుని ప్రవర్తించాలని, పబ్లిక్ లైఫ్‌లో ఉన్నంత మాత్రాన వ్యక్తిగత గౌరవాన్ని పణంగా పెట్టలేరని బాలీవుడ్ వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. సల్మాన్ ఖాన్ 'వీర్' సినిమాతో బాలీవుడ్‌కు పరిచయమైన జరీన్ ఖాన్, తన బోల్డ్ , స్పష్టమైన వైఖరితో ఈ ఘటన ద్వారా మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం స్పెషల్ సాంగ్స్ చేస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**